క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన సింహగిరి



క్యూలైన్లలో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సింహాచలం: రెండవ శనివారం సెలవు కావడంతో సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు, కేశఖండన శాల, ప్రసాద విక్రయశాల, గంగధార ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రద్దీగా మారాయి. వాహనాలను పార్కింగ్ చేయడానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సింహగిరి బస్టాండ్, గజపతిసత్రం, హిల్‌టాప్‌రోడ్డు వరకు వాహనాలను పార్క్ చేయాల్సి వచ్చింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు సత్యవతి తదితరులు

సబ్బవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 8 నుండి 15 వరకూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కార్యవర్గ సభ్యులు ఉప్పాడ సత్యవతి కోరారు. మండలంలోని వంగలి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి గోడపత్రికలు ఆవిష్కరించారు. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వంటి అంశాలకు వ్యతిరేకంగా ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నాయుకులు యర్రా సోంబాబు, పి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



గణేష్‌కుమార్

పెందుర్తి: సింహాచలం సమీపంలోని మైత్రీనగర్‌కు చెందిన యలసి గణేష్‌కుమార్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు అతడి భార్య సునీత పెందుర్తి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. గత నెల 28న తన కారులో ఇంటి నుంచి బయటికి వెళ్లిన గణేష్ తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21న మరిడిమాంబ అమ్మవారి పండగ



మాట్లాడుతున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు

పరవాడ: వెన్నెలపాలెంలో కొలువుదీరిన శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగను ఈ నెల 21న నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడారు. గ్రామ దేవతల పండగలు జరిపేటప్పుడు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13న అమ్మవారి పండగ చాటింపు వేసి 21న అంగరంగ వైభవంగా పండగ జరపడానికి సమావేశం నిర్ణయించింది. వెన్నెల వెంకునాయుడు, అప్పలనాయుడు, అప్పారావు, వెన్నెల అప్పారావు, రతాల సన్యాసిరావు, పైల రమణాజీ, బండారు అప్పారావు, ఎర్రినాయుడు, ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరీదేవికి అధివాస మహోత్సవం



సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు యాతపాలెంలోని మణిపురంలో కొలువైన శ్రీభువనేశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవంలో శంఖం పత్రితో అమ్మవారిని పూజించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు.

అద్వితీయం.. అనితరసాధ్యం



ఊరభ్రసన ఆసనం ప్రదర్శిస్తున్న వైష్ణవి



పరివృత్త ఏకపాదశిరాసన ప్రదర్శనలో వెంకట వైష్ణవి

- యోగాలో రాణిస్తున్న తానాం గురుకుల విద్యార్థినులు
- రాష్ట్రస్థాయిలో పతకాలు కొల్లగొట్టి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం



పరివృత్త ఉపవిష్ట కోణాసనం ప్రదర్శిస్తున్న కౌశిక

పరవాడ: యోగాతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆధ్యాపకులు చెప్పడంతో ఆ ప్రక్రియపై మక్కువ పెంచుకున్నారు తానాం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు చదువుతో పాటు యోగాలో శిక్షకుడు ఆంజనేయులు వద్ద కఠోర సాధన చేస్తూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో వివిధ చోట్ల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి బంగారు, వెండి, కాంస్య పతకాలతో సత్తా చాటుతున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం అందిస్తున్న సహాయ సహకారాలతో యోగా పోటీల్లో రాణిస్తూ పతకాల పంట పండిస్తున్నారు. నవంబరు 11 నుంచి 14 వరకు అస్సాంలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాదించారు.



రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన తానాం గురుకుల విద్యార్థినులు



భావన ప్రదర్శించిన పద్మవృశ్చిక ఆసనం

ప్రతి విద్యార్థికి యోగా అవసరం..



ఒత్తిడితో కూడుకున్న చదువుతో పాటు ప్రతి విద్యార్థి యోగ విద్య అభ్యసించడం తప్పనిసరి. యోగాతో పిల్లల్లో మానసిక పరిపక్వత, మానసిక ఉల్లాసం ఇనుమడిస్తుంది. పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించడంలో ధ్యాన మార్గం ఉపయోగపడుతుంది. పిల్లలకు ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యాన మార్గం కూడా నేర్పిస్తున్నాం. యోగ విద్యను పరవాడ మండలంలో వ్యాపింపజేయడానికి కృషి చేస్తా.

– సీహెచ్ ఆంజనేయులు, యోగ శిక్షకుడు, సింహాద్రి ఎన్టీపీసీ

యోగాలో మరింత నైపుణ్యం సాధిస్తా..



నేను తానాం గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. మా తల్లిదండ్రులతో విజయనగరం బొబ్బిలి దరి కునుకు గ్రామంలో నివసిస్తున్నాను. తండ్రి తిరుపతిరావు వ్యవసాయ కూలీ. తల్లి ధనలక్ష్మి అంగన్‌వాడీలో ఆయాగా పని చేస్తుంది. ఐదేళ్లుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణలో తర్ఫీదు పొందాను. రాష్ట్రంలో పలు చోట్ల జరిగిన యోగా పోటీల్లో పతకాలు సాధించా. భీమిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించా. అక్టోబరులో కర్నూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించి అస్సాంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించా. యోగాలో వందకు పైగా ఆసనాలు నేర్చుకున్నా. భవిష్యత్‌లో యోగాలో మరింత నైపుణ్యం సాధించడమే నా లక్ష్యం.

– కునుకు భావన, కునుకువానిపాలెం

అంతర్జాతీయ యోగా పోటీల్లో పాల్గొనడమే లక్ష్యం..



నేను తానాం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రులతో సత్తివానిపాలెంలో ఉంటున్నాను. తండ్రి సత్యనారాయణ కారు డ్రైవరుగా పని చేస్తున్నాడు. తల్లి ఆదిలక్ష్మి గృహిణి. 2022లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించా. 2023–24లో ఎస్‌జీఎఫ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. 2022, 23, 24లో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించి నవంబరు 11 నుంచి 14 వరకు అస్సాంలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించా. 250 ఆసనాలు నేర్చుకున్నాను. అంతర్జాతీయ యోగా పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతా.

– సీరా కౌశిక, సత్తివానిపాలెం

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా..



తల్లిదండ్రులతో దేవరాపల్లిలోని వడ్రపాలెంలో ఉంటున్నాను. తానాం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నా తల్లిదండ్రులు సతీష్, అన్నపూర్ణ వ్యవసాయ కూలీలు. నాలుగేళ్లుగా యోగ శిక్షకుడి వద్ద సాధన చేస్తూ మెలకువలు చేర్చుకున్నాను. నేను యోగాలో 300కు పైగా ఆసనాలు వేయగలను. 2022లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించాను. అదే ఏడాది రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం, 2023లో నాగార్జున యూనివర్సిటీలో, కర్నూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో యోగా పోటీల్లో పతకం సాధించడమే నా లక్ష్యం.

– బోను వైష్ణవి, వడ్రపాలెం

స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..



మా స్వగ్రామం తుంపాల. నేను తానాం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. నా తల్లిదండ్రులు వెంకట జోగ ప్రసాద్ వెల్డింగ్ పనులు చేస్తాడు. తల్లి సత్య కుమారి గృహిణి. నేను ఐదేళ్లుగా యోగాలో సాధన చేస్తూ 150 ఆసనాలు నేర్చుకున్నా. 2022లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. 2024 అక్టోబరులో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి అస్సాంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. భవిష్యత్‌లో యోగాసన స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం పొందడమే నా లక్ష్యం.

– కోటా వెంకట వైష్ణవి, తుంపాల

భూ సమస్యల పరిష్కారానికి కృషి



ఇరువాడలో రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: భూముల రీ సర్వే అనంతరం రైతుల మిగిలిన భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. రైతుల పట్టా భూముల సమస్యలు పరిష్కరిస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. ఇరువాడ, అసకపల్లి గ్రామాల సరిహద్దులో ఉన్న సర్వే నంబర్లలో ఉన్న గందరగోళంతో తరుచూ సరిహద్దు వివాదాలు తలెత్తుతున్నాయని వాటిని పరిష్కరించాలని ఆయా గ్రామాల పెద్దలు, రైతులు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌ను కోరారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 689 మంది ఖాతాదారులు ఉండగా 654.32 ఎకరాల భూమి ఉందన్నారు. రీ సర్వే తర్వాత 2,918 ఎల్‌పీఎంలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ భూమి 190.85 ఎకరాలు కాగా జిరాయితీ భూమి 463.45 ఎకరాలు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, ఉప సర్పంచ్ బీఎస్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పారావు, మండల సర్వేయర్ ఎల్. అప్పారావు, రాంబాబు, వీఆర్వో రామ అప్పారావు, స్థానిక నేతలు బలిరెడ్డి కనకరాజు, రేసుపూడి రమణ, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై సీపీఎం నిరసన



ధరల పెరుగుదలపై నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఎం ప్రతినిధులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందకుండా పోతున్నాయని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ విమర్శించారు. ఎన్నికల సమయంలో నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రజలకు అండగా ఉంటామని గద్దెనెక్కిన టీడీపీ–జనసేన–బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. ధరల పెరుగుదలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం 94వ వార్డు చైతన్య నగర్, 97వ వార్డు వీరానగర్, 98వ వార్డు అప్పన్నపాలెంలలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మహిళలపై దాడులు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ ఇతర అంశాలపై దృష్టి పెడుతున్నారని విమర్శించారు. సీపీఎం ప్రతినిధులు వెంకటలక్ష్మి, డి.జగన్, శంకర్రావు, కె.అప్పలనాయుడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలి



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్

పెందుర్తి: అన్యాయాన్ని ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల ఆసక్తి కలిగించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు పెందుర్తిలో ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నగరంలోని ఆర్‌కే బీచ్‌లోని సబ్ మెరైన్, ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సందర్శనకు విద్యార్థులు వెళ్లారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ, ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ డైరెక్టర్ జి.వి మనోజ్‌కుమార్, శాస్త్రవేత్త విజయ్‌కుమార్, చెకుముకి పూర్వ సంపాదకుడు, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య, రాష్ట్ర సమతా పూర్వ కన్వీనర్ రాధారాణి, మత్స్యశాఖ శాస్త్రవేత్త విజయకుమరన్, డాక్టర్ పద్మ, సమతా రాష్ట్ర కన్వీనర్ నిర్మల, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, చెకుముకి కన్వీనర్ ప్రసాద్, మురళీధర్, త్రిమూర్తులు, శ్రీనివాస్, పరశురాం, శేషగిరిరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ఘనంగా కల్యాణోత్సవం



పెందుర్తి: వేంకట్రాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో హోమాలు చేశారు. అనంతరం పూజలు జరిపారు. సాయంత్రం వెంకన్న కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. సప్త హారతులు ఇచ్చారు. ఈవో నీలిమ, ఆలయ కమిటీ చైర్మన్ ఎం.ఎస్ రాజు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సోమవారం ఉత్సవాలు ముగియనున్నాయి.

శివునికి ఘనంగా మహా భస్మాభిషేకం



పూజల్లో పాల్గొన్న సర్పంచ్ శిరీష అదీప్‌రాజ్, జెడ్పీ మాజీ ఫోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు

పెందుర్తి: సాధుమఠం స్వయంభూ ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివునికి శనివారం మహా భస్మాభిషేకం నిర్వహించారు. కాశీ నుంచి తీసుకొచ్చిన విభూదితో స్వామికి అభిషేకం చేశారు. అనంతరం కార్తీక దీపోత్సవం, శివునికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష అదీప్‌రాజ్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సింహగిరిపై కారులో నుంచి మంటలు



మంటలను అదుపుచేస్తున్న దృశ్యం

సింహాచలం: సింహగిరిపై బస్టాండ్‌లో శనివారం ఉదయం ఒక కారు ఇంజిన్‌లో నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల ఉన్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులయ్యారు. వివరాలోకి వెళ్తే కొండదిగువ నుంచి కొండపైకి ఉదయం కొంత మంది కారులో వచ్చారు. సరిగ్గా బస్టాండ్ సమీపంలోని గాయత్రి మఠం వద్దకు వచ్చే సరికి ఇంజిన్‌లో నుంచి మంటలు రావడంతో కారులో ఉన్నవారంతా దిగిపోయారు. శనివారం కావడంతో ఆ సమయంలో బస్టాండ్‌లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. వారు ఈ ఘటనకు భయపడ్డారు. వెంటనే సెక్యూరిటీ గార్డులు, స్థానిక వ్యాపారులు మంటలను అదుపు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, కార్పొరేటర్ వసంత

పెందుర్తి: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అధికారులకు సూచించారు. జీవీఎంసీ 94, 97 వార్డుల పరిధిలో శనివారం జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. 97వ వార్డు సుజాతానగర్ సెంట్రల్ బ్యాంక్ వద్ద బీటీ రోడ్డు, గోపాలకృష్ణనగర్‌లో ఆర్‌సీసీ బాక్స్ కల్వర్టు నిర్మాణం, చినముషిడివాడ సత్యనగర్, గణేష్ నగర్‌లలో కల్వర్టులు, డ్రైన్ల నిర్మాణం, చినముషిడివాడ పాతూరు సీసీ డ్రైన్లు, కల్వర్టు నిర్మాణం, శ్రమశక్తినగర్, కిషోర్ లేఅవుట్‌లో బీటీ రోడ్ల నిర్మాణం, 94వ వార్డు పురుషోత్తపురంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు శానాపతి వసంత శంకర్రావు, బల్ల శ్రీనివాసరావు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

పరుగు పోటీల్లో సత్తా



సత్తా చాటిన విద్యార్థులతో కోచ్ స్టాలిన్ జేమ్స్ తదితరులు

పరవాడ: శ్రీకాకుళంలో ఈ నెల 3, 4 తేదీల్లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పరుగు పోటీల్లో ఎన్టీపీసీ బాల భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని కోచ్ స్టాలిన్ జేమ్స్ తెలిపారు. ఈ పోటీల్లో బి.సంధ్యారాణి బంగారు పతకం సాధించగా కన్నూరు సాయిరాగిణి రజత పతకం కైవశం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతీదేవి అభినందించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు బర్ధన్‌నగర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు సీపీఐ నేతలు వినతిపత్రం అందించారు. శనివారం పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు కాలనీ సమస్యలు వివరించారు. సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు, కాలనీ ప్రతినిధులు అరుణ, అనురాధ, జగదాంబ, దమయంతి, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనగర్‌లో మెగా వైద్య శిబిరం

పెందుర్తి: అక్షయ ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీనగర్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. దంత, నేత్ర, చిన్న పిల్లల వైద్య నిపుణులు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. క్యాన్సర్ వైద్య పరీక్షలు కూడా ఉచితంగా జరుగుతాయన్నారు. అనంతరం స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.